బోనాలకు ముస్తాబైన దేవాలయాలు


బోనాలకు సిద్ధమైన మణికొండ పోచమ్మ దేవాలయం


బోనాలకు సిద్ధమైన పుప్పాలగూడ పోచమ్మ ఆలయం


బోనాలకు ముస్తాబైన భాగ్యలక్ష్మికాలనీ దుర్గామాత ఆలయం

మణికొండ: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలలో భాగంగా ఆషాఢమాసంలో గ్రామదేవతలకు నిర్వహించే బోనాల ఉత్సవాలను మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం జరుపుకుంటున్నారు. అందుకు అనుగుణంగా గ్రామ దేవత అయిన పోచమ్మ, ఎల్లమ్మ, దుర్గమ్మ తదితర దేవాలయాలను అందంగా తీర్చిదిద్దారు. రంగుల పూలు, వీధి దీపాలతో శోభాయమానంగా తీర్చి దిద్దుతున్నారు. మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, మంచిరేవుల, గండిపేట, కోకాపేట తదితర గ్రామాలలో ఆదివారం బోనాల పండగను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమైయ్యారు. అమ్మవార్లకు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాల మధ్య బోనాలను మహిళలు తీసుకుని వెళ్లి నైవేద్యంగా సమర్పిస్తారు. కోడి పుంజులు, మేక, పొట్టేలులను అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించి బంధు, మిత్రులతో కలిసి పండగను ఆనందంగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుంది. మున్సిపాలిటీల నుంచి ప్రతి గ్రామంలోని దేవాలయాలను తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేసేందుకు రూ. లక్షను కేటాయించి పనులను చేపట్టారు. కొన్ని ఆలయాల వద్ద నాయకులు స్వంత ఖర్చులతో మరింత అలంకరణలను చేపట్టారు.


పూలతో దేవాలయాలను అలంకరిస్తున్న సిబ్బంది

ఉత్సవాలకు సర్వం సిద్ధం


ఆలయం వద్ద అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు భారీ ఎత్తున జరుగనున్నాయి. దీంతో శనివారం బండ్లగూడ, కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, దర్గా ఖలీజ్‌ఖాన్, బైరాగిగూడ, పీరంచెరువు, కాళీమందిర్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాలను నిర్వాహకులు వివిధ రకాల విద్యుత్ దీపాలతో, పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు శనివారం నాయకులు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, వేణుగౌడ్, మహాలింగంగౌడ్, దేవానంద్‌గౌడ్, తిరుమల్లేష్‌గౌడ్, హరికృష్ణ, యాదయ్య, జగన్‌గౌడ్, నరహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి


కుటుంబ సభ్యులతో కలిసి మొక్కను నాటుతున్న విద్యార్థిని అభినందిని

అత్తాపూర్: హైదర్‌గూడ ప్రాంతానికి చెందిన రాచూరి అభినందిని కేంద్రీయ విద్యాలయం గోల్కొండ -1లో 12వ తరగతి చదువుతుంది. వాతావరణం కాలుష్యం నుంచి ఎవరికి వారు రక్షించుకునేందుకు మొక్కలు నాటి మహావృక్షాలుగా ఎదిగేందుకు ఆ మొక్కలను దత్తత తీసుకోవాలన్నారు. జనాభాకు అనుగుణంగా వన సంపద లేకపోవడంతో భవిష్యత్ తరాలకు తాము నాటిన చెట్ల రూపంలోనే తాతా, మామా, అమ్మ, నాన్నమ్మ, నాన్న అనే పేర్లతో పెట్టుకుని చెట్లను నాటాలని రాచూరి అభినందిని పిల్లలకు సూచించారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం


పుస్తకాలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు అండగా ఉంటామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. శనివారం ఆయన పుప్పాలగూడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా పేదలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తున్నారని, వారికి అన్ని రకాల సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఇప్పటికే పాఠశాల అభివృద్ధికి మున్సిపాలిటీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు డి. పురుషోత్తం, కె.లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేష్, బి.ముత్యాలు, కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో నిర్మాణంలో ఉన్న వ్యాయాంశాల భవనం పనులను పరిశీలించారు.

స్పాట్ అడ్మిషన్లకు ఈ నెల 30 ఆఖరు

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకుల మోడల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. ఈ నెల 30 లోపు అందుబాటులో ఉన్న సీట్లను భర్తీ చేస్తామన్నారు. డే స్కాలర్స్ కోసం మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అంతేకాకుండా మోడల్ స్కూల్‌లో హవర్లీ బేస్డ్‌పై పీజీటీ, కెమెస్ట్రీ లెక్చరర్ పోస్టుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

బ్లూక్రాస్ సంస్థను సందర్శించిన కమిషనర్


బ్లూక్రాస్‌ను సందర్శిస్తున్న మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: వీధికుక్కల బెడదను తగ్గించడంలో బ్లూ క్రాస్ సోసైటీ చేస్తున్న కృషి ఎంతో ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర జూబ్లిహిల్స్‌లోని బ్లూక్రాస్ సోసైటీ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా బ్లూ క్రాస్ సంస్థ ఫౌండర్, చైర్ పర్సన్ అమల అక్కినేనితో కలిసి కుక్కల స్టేరిలైజేషన్, గ్రూమింగ్ విధానాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అండర్ 11-19 టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న కెకె మహేశ్వరీ

మైలార్‌దేవ్‌పల్లి: మహావీర్ గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి స్మారక టోర్నమెంట్ ఇండోర్‌హాల్‌లో శనివారం తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ కెకె మహేశ్వరిచే ప్రారంభం చేశారు. అండర్ 11-19 బాలబాలికల మెన్స్, ఉమెన్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి తెలిపారు.

ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల విస్తరణ

జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి


గచ్చిబౌలిలో రహదారులను పరిశీలిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల విస్తరణ చేపడతామని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మల్కం చెరువు, గచ్చిబౌలి, ఖాజాగూడ, క్యూమార్ట్ జంక్షన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని రోడ్ల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తున్న విద్యుత్ స్తంభాలను మార్చాలని అధికారులకు సూచించారు. ఫ్రీ లెఫ్ట్‌తో పాటు రహదారుల విస్తరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రిసిటీ విభాగాలు సమన్వయంతో పని చేయాలన్నారు. రహదారుల విస్తరణలో చెట్లను నరకవద్దని, సురక్షిత పద్ధతిలో ట్రాన్స్‌లొకేట్ చేయాలన్నారు. రోడ్ల వెంట గోడలపై ఆలోచింపజేసే అందమైన చిత్రాలను వేయించాలని, అందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని యూబీడీ అధికారులను ఆదేశించారు. ప్రతి కూడలి శుభ్రంగా ఉంచాలని, చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, యూబీడీ డిప్యూటి డైరెక్టర్ అనిల్, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారుపై కూలిన చెట్టు

మణికొండ: రోడ్డుపై వెళ్తున్న ఓ కారుపై ఒక్కసారిగా చెట్టు కూలి పడింది. దీంతో కారు పైభాగం ధ్వసం అయింది. కారులో డ్రైవర్ మాత్రమే ఉండగా అతనికి ఎలాంటి గాయాలు కాలేదు. మణికొండ మున్సిపాలిటీ నుంచి నార్సింగికి వెళ్లే దారిలో ఉన్న బీఆర్‌సీ అపార్ట్‌మెంట్స్ ముందు శనివారం ఉదయం ఓ చెట్టు అకస్మాత్తుగా కూలి...అదే సమయంలో అటుగా వెలుతున్న ఓ క్యాబ్‌పై పడింది. ఆ సమయంలో కారులో వెనుకసీట్లో ప్రయాణికులు ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న మణికొండ మున్సిపాలిటీ డిజాస్టర్ టీం వెంటనే అక్కడకు చేరుకుని చెట్టును ముక్కలుగా కోసి పక్కకు తొలగించారు. ఈ రూట్లో గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అదే రోడ్డులో మరికొన్ని చెట్లు ఎండిపోయి ఉన్నాయని, వాటిని తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరారు.



ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం


ఎమ్మెల్యే గాంధీని కలిసిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బసవతారకనగర్ వాసులు

- సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతాం
- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: బసవతారకనగర్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి పూర్తి న్యాయం చేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్థానికులకు హామీ ఇచ్చారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బసవతారక నగర్‌వాసులు ఎమ్మెల్యే గాంధీని శనివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే గాంధీ స్పందిస్తూ బసవతారక నగర్‌వాసుల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసేలా చూస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు.కాగా అంతకుముందు బసవతారకనగర్‌వాసులు గుడిసెలు వేసుకొని ఉంటున్నారని, వారికి న్యాయం చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఎమ్మెల్యే గాంధీకి వివరించారు.

శ్మశానాలను అభివృద్ధి చేస్తాం


అభివృద్ధి పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలోని, అన్ని కులాలకు సంబంధించిన శ్మశానవాటికలను అభివృద్ధి చేసి, అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం మంచిరేవులలోని యాదవ స్మశాన వాటికను రూ. 40లక్షలతో అభివృద్ధి చేసే పనులను ఆమె మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మవీరారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని అన్ని శ్మశాన వాటికలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నరసింహారాజు, ఏఈ శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు వరదాచారి, శ్రీరాములు, డి.లక్ష్మన్, రవి, సతీష్, జంగయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాను అనుగుణంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని ఇంద్రానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కురిసిన వర్షాలకు రోడ్లు గోతులమయంగా మారాయని, దీంతో ప్రయాణికులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సమస్యను పరిశీలించి నిధులను మంజూరు చేయించామన్నారు. పనులను త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 16వ డివిజన్ ఇన్‌చార్జీ టింకురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు


సత్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో 12 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయునిగా రవి, 9 సంవత్సరాలుగా ఉపాధ్యాయునిగా రాములు పనిచేశారు. అయితే వారికి బదిలీ కావటంతో శనివారం నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మవీరారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పి. సంజీవరెడ్డి, ఎం. ప్రవీణ్‌యాదవ్, నాయకులు దశరథ్, డి. లక్ష్మన్, రవి, శ్రీరాములు, క్రాంతి, అఫ్జల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ


శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నుంచి బదిలీలో వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఘనంగా వీడ్కోలు పలికారు. నర్ఖూడలో ఇంఛార్జీ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంతగౌడ్ బదిలీపై వెళ్లడంతో ఆయనను స్థానిక నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఉషా కిరణ్, నాయకులు శివాజీ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఇన్వెస్టిచర్ వేడుకలు


పాఠశాలలో ఇన్వెస్టిచర్ వేడుకలు

అత్తాపూర్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని మిల్లెట్ బ్యాంక్ వ్యవస్థాపకురాలు విశాలరెడ్డి అన్నారు. శనివారం పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్నికైన హెడ్ బాయ్, హెడ్ గర్ల్, నాలుగు సభల కెప్టెన్లు, వైస్ కెప్టన్లు, డైమండ్, రూబీఈ, ఎమరాల్డ్, సఫైర్‌లతో పాటు క్లబ్ కెప్టెన్‌లతో ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మిల్లెట్ బ్యాంక్ వ్యవస్థాపకురాలు విశాలరెడ్డి, గౌరవ అతిథి నిదా ఫాతిమా (పోషకాహార నిపుణులు), విశిష్ట అతిథిగా రాజేంద్రనగర్ పీసీ సత్యనారాయణలు, విద్యార్థి పరిషత్ బాడీని గౌరవించారు. గార్డ్ ఆఫ్ హానర్ తరువాత మార్చ్ ఫాస్ట్, ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అనంతరం అతిథులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలని, వారి కలలను అనుసరించాలని ప్రోత్సహించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడం వల్ల కలిగే ప్రయోజనాలను, భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండడానికి ఎంత ముఖ్యమో కూడా వివరించారు. ఎన్నికైన విద్యార్థి కౌన్సిల్ సభ్యుల తల్లిదండ్రులను కూడా ఇన్వెస్టిచర్ వేడుకకు ఆహ్వానించారు. అంతేకాకుండా పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌కి ఇది రెడ్ లెటర్ డే.

సీఎం దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి బి. గణేష్‌కుమార్, బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో దళితుల అభ్యున్నతికి రూ. 36,750కోట్లు కేటాయించగా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారికి రూ. 33,124 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. ఒక బడ్జెట్‌లోనే రూ. 3600 కోట్ల పై చిలుకు నిధులకు కోత పెట్టి వారి పట్ల వివక్ష చూపిందన్నారు. వెంటనే బడ్జెట్‌ను సరిదిద్ది వారికి గత ప్రభుత్వం కన్నా అధికంగా నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఓబీసీ మోర్చ అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు సీహెచ్ బిక్షపతి యాదవ్, నాయకులు నగేష్ యాదవ్, కృష్ణ, శివరాజ్, నాగేష్, అరవింద్, బాలరాజు, అప్ప పాల్గొన్నారు.